సాక్షి
వికారాబాద్
గురువారం । 14 । మార్చి । 2024



మాట నిలబెట్టుకున్న సర్కారు

ఆర్యవైశ్య, మున్నూరుకాపు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి సీఎం మాట నిలుపుకొన్నారని ఆ సంఘాల నేతలు అన్నారు. 9లో▸



అన్ని రంగాల్లో రాణించాలి

మహిళలు అన్ని రంగాల్లో చైతన్యవంతులు కావాలని ఇబ్రహీంపట్నం వైద్యాధికారి డాక్టర్ సరిత పేర్కొన్నారు. 9లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
గురువారం (సాయంత్రం)	శుక్రవారం (ఉదయం)
6:31	5:02

న్యూస్‌రీల్

క్రీడలతో ఆరోగ్యకర జీవనం



మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అనంతగిరి: ఆరోగ్యకర జీవనానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. జేకేఎంఆర్, టీపీఎఫ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో వికారాబాద్‌లోని చిగుళ్లపల్లి మైదానంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజేత జట్లకు మంగళవారం రాత్రి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. క్రీడల అభివృద్ధికి తాము అండగా ఉంటామన్నారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, ఓటమి గెలుపునకు నాంది అన్నారు. ప్రధాని మోదీ గ్రామ గ్రామాన క్రీడా మైదానాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. పోటీల్లో శివారెడ్డిపేట జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో బండ్లగూడ జట్టు, మూడో స్థానంలో వికారాబాద్ జట్టు నిలిచింది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మాజీ అధ్యక్షుడు సదానందరెడ్డి, వాలీబాల్ ఆర్గనైజర్ నవీన్‌కుమార్, జిల్లా నాయకులు అమరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఆర్గనైజర్లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

డీఏ ప్రకటించకపోవడం శోచనీయం

యాలాల: తెలంగాణ మంత్రి వర్గ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల డీఏ, పీఆర్‌సీపై సానుకూల ప్రకటన చేయకపోవడం శోచనీయమని పీఆర్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, యాదయ్యగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల పెండింగ్ కరెంటు బిల్లుల చెల్లించేందుకు ప్రభుత్వం ముందుకు రావడంపై సంతోషం వ్యక్తం చేశారు.

నూతన నియామకం

అనంతగిరి: వికారాబాద్ జిల్లా జూనియర్ ఫారెస్టు అధికారుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎస్‌కే ఫరీద్ ఎన్నికయ్యారు. బుధవారం పట్టణంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మల్లప్ప, ప్రధాన కార్యదర్శిగా వెంకటలక్ష్మి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సాయికుమార్, జాయింట్ సెక్రటరీ రవి, కోశాధికారి కార్తీక్‌రెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం వీరు జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

రేపు చేవెళ్లకు మంద కృష్ణమాదిగ రాక

అనంతగిరి: చేవెళ్లలో ఈ నెల 15న జరిగే పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు ఆ సంఘం జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్ తెలిపారు. బుధవారం వికారాబాద్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ ముఖ్య నాయకులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల సమావేశానికి జిల్లాలోని అన్ని మండలాల బాధ్యులు, గ్రామ స్థాయి నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్, నాయకులు శంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దైవ భక్తి ఉండాలి



పూజలు చేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: ప్రతి ఒక్కరికీ దైవ భక్తి ఉండాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చీలాపూర్‌లో బీరప్ప, మల్లన్న, మహంకాళీ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ ఆర్‌డీఓ బదిలీ

అనంతగిరి: వికారాబాద్ ఆర్‌డీఓ విజయ కుమారి బదిలీ అయ్యారు. బుధవారం ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. విజయకుమారిని ఏటూరు నాగారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేశారు. పెద్దపల్లి ఆర్‌డీఓగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ మధుమోహన్‌ను వికారాబాద్‌కు బదిలీ చేశారు.

కారు నుంచి కాసాని

చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిని ప్రకటించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్



పరిగి: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు అభ్యర్థుల జాబితాలు విడుదల చేస్తున్నాయి. బుధవారం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్.. చేవెళ్ల అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పేరును ప్రకటించారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న రంజిత్‌రెడ్డి పోటీకి విముఖత చూపడంతో సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకుని సత్తా చాటేందుకు గులాబీ దళపతి ఊహించని రీతిలో కాసానికి టికెట్ కేటాయించారు. పార్లమెంట్ పరిధిలో ఈ నెల 23న భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. కాగా బీజేపీ నుంచి గతంలో ఇక్కడ ఎంపీగా పనిచేసిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పోటీలో ఉన్నారు. అధికార కాంగ్రెస్ నుంచి పట్నం సునీతారెడ్డి పేరు దాదాపు ఖరారే అంటూ వార్తలు వినిపిస్తున్నా అధికారిక ప్రకటన వెలువడలేదు. ముదిరాజ్ సంఘం జాతీయ అధ్యక్షుడిగా ఉన్న కాసాని చేవెళ్ల నుంచి రెండో సారి ఎంపీ అభ్యర్థిగా తలపడుతున్నారు. గతంలో మన పార్టీని స్థాపించిన ఆయన 2009లో ప్రజారాజ్యం పార్టీతో పొత్తు పెట్టుకుని చేవెళ్ల పార్లమెంట్ స్థానానికి పోటీ చేశారు.

పట్టున్న నాయకుడు..

కాసాని జ్ఞానేశ్వర్ బీసీ సామాజిక వర్గానికి చెందిన నేత కావడం, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవం, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంపై పూర్తి పట్టున్న వ్యక్తి కావడంతో బీఆర్‌ఎస్ ఆయనవైపు మొగ్గు చూపింది. దీనికి తోడు ముదిరాజ్ మహాసభ పేరుతో సంఘాన్ని స్థాపించిన ఆయన రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు కలిగిన నేత కావడం కలిసొచ్చే అంశం. 2009, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పరిగి నియోజకవర్గం నుంచి కాసాని ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని ప్రచారం సాగినా.. చివరి నిమిషంలో తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు.

బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం



మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో ఘోరంగా విఫలమైంది. ఇప్పటి వరకు చాలా మంది అన్నదాతల ఖాతాల్లో రైతుబంధు సాయం పడలేదు. కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది. బీసీలంతా బీఆర్‌ఎస్ వైపే ఉన్నారు. చేవెళ్ల పార్లమెంట్ టికెట్టు కాసానికి ఇవ్వడం సంతోషంగా ఉంది. ఆయన్ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటాం.

– కొప్పుల మహేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే



బయోడేటా

పేరు: కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్
తల్లిదండ్రులు: కౌసల్య, రాములు
భార్య: చంద్రకళ
పుట్టిన తేదీ: 19.08.1954
విద్యాభ్యాసం: ఎస్‌ఎస్‌సీ
స్వగ్రామం: బాచుపల్లి, కుత్బుల్లాపూర్ మండలం, మేడ్చల్ జిల్లా
కులం: ముదిరాజ్
ప్రస్తుత పదవి: బీఆర్‌ఎస్ నేత, తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు
రాజకీయం ప్రస్థానం: 1975–1987 వరకు యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు. 1988–1993 కుత్బుల్లాపూర్ ఎంపీపీ, 93 బీసీ కులాల ఐక్య వేదిక అధ్యక్షుడిగా, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, తెలంగాణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా, హైదరాబాద్ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు.
2005, 2022–2023లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు
2001–2006 వరకు టీడీపీ నుంచి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్
2008–2012 వరకు రాజ్యసభ సభ్యుడు
2007లో మన పార్టీని స్థాపించారు.
2009 ఎన్నికల్లో మన పార్టీ, ప్రజారాజ్యం పొత్తుతో చేవెళ్ల ఎంపీగా పోటీ

వడదెబ్బకు గురికావొద్దు

జిల్లా వైద్యాధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్



మాట్లాడుతున్న పాల్వన్‌కుమార్

అనంతగిరి: ఎండ తీవ్రత పెరుగుతున్నందున చిన్న పిల్లలు, వృద్ధులు వడదెబ్బకు గురికాకుండా సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్ సూచించారు. బుధవారం వికారాబాద్‌లోని జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో మాతాశిశు మరణాలపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సూపర్ వైజర్లు, ఆశ వర్కర్లతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం చేసుకునే వరకు వారిలో ఎలాంటి ప్రమాదకర లక్షణాలు కనిపించినా వెంటనే సంబంధిత వైద్యాధికారికి రెఫర్ చేయాలని ఆదేశించారు. అవసరమైతే పైస్థాయి ఆసుపత్రులకు తీసుకెళ్లాలని సూచించారు. సకాలంలో వైద్యం అందించి తల్లి, బిడ్డ ప్రాణాలు కాపాడటం మన బాధ్యత అని పేర్కొన్నారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఆదేశించారు. ఎండ తీవ్రత పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరం ఉంటే తప్ప బయట తిరగరాదన్నారు. ఒక వేళ బయటికి రావాల్సి వస్తే తలపై టోపీ లేదా గొడుగు వంటి వాటిని ఉపయోగించాలని సూచించారు. తరచూ నీరు తాగడం మంచిదన్నారు. విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని, రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కీటక జనిత వ్యాధుల నివారణపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిష్పాక్షికంగా ఎన్నికల విధులు

- ప్రచార సరళి, ఎన్నికల వ్యయంపై నిశిత పరిశీలన తప్పనిసరి
- నిఘా బృందాలకు, అధికారులకు అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ దిశానిర్దేశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల విధులను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులకు సూచించారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని స్టాటిస్టిక్ సర్వేలైన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ తదితర నిఘా బృందాల అధికారులకు బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయా పార్టీలు, అభ్యర్థుల ప్రచార సరళి పరిశీలన, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను నిరోధించడం, ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం, నిరంతర తనిఖీల నిర్వహణ తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో నిఘా బృందాలు సమర్థవంతంగా, నిబద్ధతతో తమ బాధ్యత నిర్వహించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలన్నారు. అన్ని పార్టీలు, అభ్యర్థుల పట్ల నిబంధనలకు అనుగుణంగా సమదృష్టితో వ్యవహరించాలన్నారు. వివక్షను ప్రదర్శించారనే ఫిర్యాదులు రాకుండా పక్కాగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలకు తప్పవని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవిశంకర్ రెడ్డి

విద్యార్థి సమస్యలు పరిష్కరించండి

- ఆర్‌ఎస్‌యూ వ్యవస్థాపక అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి

కొడంగల్: తెలంగాణలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆర్‌ఎస్‌యూ (రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్) వ్యవస్థాపక అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఆర్‌ఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర నూతన కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ రంగ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాల్లో పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలన్నారు. ఖాళీగా ఉన్న వార్డెన్, కుక్, కామా టీ, నైట్ వాచ్‌మెన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కస్తూర్బా పాఠశాలల్లో విద్యార్థులకు రక్షణ కల్పించాలన్నారు. కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలన్నారు. ప్రతి జిల్లాలో పదివేల మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, అధ్య క్షుడిగా భీమరాజు, ప్రధాన కార్యదర్శిగా సురేష్ గౌడ్, ఉపాధ్యక్షులుగా బలరాజ్ గౌడ్, ప్రభాకర్, సహాయ కార్యదర్శులుగా రమేష్, కేశవులు, శ్రీకాంత్, కోశాధికారిగా చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎక్కడ కూడా వాల్ రైటింగ్, పోస్టర్లు, ఫ్లెక్సీలు ఉండరాదని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల పరిధిలో వాల్ పోస్టర్లు, వాల్ రైటింగ్, ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలన్నారు. జిల్లాలో సీసీ రోడ్ల పురోగతి బాగుందని, ఈ నెల 20 నాటికి నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. బొంరాస్‌పేట, తాండూరు, బషీరాబాద్, కొడంగల్ మండలాల వారీగా అభివృద్ధి పనుల గురించి తెలుసుకున్నారు. నిర్మాణ దశలో ఉన్న గ్రామ పంచాయతీ భవనాలను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ శ్రీనివాస్, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

జిల్లా అంతటా ఎన్నికల కోడ్ వర్తింపు

తాండూరు టౌన్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎలక్షన్ కోడ్ అమల్లో ఉంటుందని తాండూరు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, ఆర్డీఓ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ పార్టీలకు చెందిన వాల్ పోస్టర్లు, బ్యానర్లు, వాల్ పెయింటింగ్ ఉండరాదని సూచించారు. అలాంటివి ఉంటే వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఎంపీడీఓలను ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలో 277 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు.



తాండూరు టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

హస్తం టికెట్‌పై ఉత్కంఠ

- మొదటి జాబితాలో సునీతారెడ్డికి దక్కని చోటు
- చేవెళ్ల ఎంపీ టికెట్ రేసులో పలువురు ముఖ్యులు
- పట్నం శ్రేణుల్లో అయోమయం
- రంగంలోకి కేఎల్ఆర్..
- బీఆర్‌ఎస్ ముఖ్యనేత సైతం.. ?



వికారాబాద్: హస్తం పార్టీ చేవెళ్ల లోక్‌సభ టికెట్‌పై ఉత్కంఠ నెలకొంది. ఇటీవల కాంగ్రెస్ ప్రకటించిన మొదటి జాబితాలో చేవెళ్ల ప్రస్తావన లేదు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేవెళ్ల టికెట్ ఆశిస్తూ జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే. అయితే చేవెళ్ల ఎంపీ టికెట్‌కు ఆ పార్టీ నుంచి పెద్దగా పోటీ లేకపోవడంతో సునీతారెడ్డి పేరు దాదాపు ఖరారయ్యిందని అందరూ భావించారు. కాంగ్రెస్ మొదటి జాబితాలో ఆమె పేరు ఉంటుందని అనుకున్నారు. లేకపోవటం పట్నం అనుచరులను ఆందోళనలో పడేసింది. తనకే టికెట్ వస్తుందనే ధీమాతో ఆమె పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేస్తూ ప్రచారం మొదలు పెట్టారు. అయితే టికెట్ రేసులో కొత్త కొత్త నేతల పేర్లు తెరమీదకు వస్తుండటంతో పట్నం అనుచరులను ఆందోళన నెలకొంది.

తెరపైకి కేఎల్ఆర్

కాంగ్రెస్ మొదటి జాబితా వెలువడే వరకు చేవెళ్ల ఎంపీ టికెట్ రేసులో కేవలం పట్నం సునీతారెడ్డి మాత్రమే ఉన్నారు. ఆమె పేరు లేకపోవడంతో కొత్త నేతల పేర్లు తెరమీదకు రావటం మొదలయ్యింది. కేఎల్ఆర్ రంగ ప్రవేశంతోనే మొదటి జాబితాలో సునీతమ్మ పేరు మాయమయ్యిందని ప్రచారం సాగుతోంది. అధిష్టానం ఆదేశాలతో అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ చేశానని, పార్టీ పెద్దల ముందు ఆయన మొరపెట్టుకున్నట్టు సమాచారం. తనకు చేవెళ్ల లోక్‌సభ టికెట్ తనకే ఇవ్వాలని ఆయన అధిష్టానం ముందు ప్రాథేయపడినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే పార్టీ పెద్దలు పునరాలోచనలో పడినట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే మొదటి జాబితాలో సునీతారెడ్డి పేరు లేదనే ఊహాగానాలు ఊపందుకున్నాయి.

బీఆర్‌ఎస్ నేత ప్రయత్నాలు

చేవెళ్ల బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపీ బరి నుంచి తప్పుకున్నారు. దీంతో పార్టీ అధినేత కేసీఆర్.. చేవెళ్ల అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పేరును బుధవారం ప్రకటించారు. ప్రస్తుతం రంజిత్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్నా.. కాంగ్రెస్ తరఫున పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ఆయన సన్నిహిత వర్గాల ద్వారా తెలుస్తోంది. అది కూడా చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచే పోటీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. పట్నం సునీతారెడ్డి.. కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి వర్గాలు టికెట్ కోసం కీచులాడుకుంటే బీఆర్‌ఎస్ నేత తన్నుకుపోయినా ఆశ్చర్యపోవాల్సిన పని లేదని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. కాంగ్రెస్ నుంచి ఇద్దరూ బలమైన అభ్యర్థులే కావడంతో చేవెళ్ల ఎంపీ టికెట్ ఎవరికి వచ్చినా బీజేపీ వర్సెస్ కాంగ్రెస్ మధ్య హోరాహోరీ సమరం తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారు.

18 రోజులు.. రూ.10.51కోట్లు

- పన్నుల వసూలులో తాండూరు మున్సిపాలిటీ వెనుకంజ
- రూ.13.50 కోట్లకు గాను రూ.2.99కోట్లే వసూలు




తాండూరు మున్సిపల్ కార్యాలయం

తాండూరు: పన్నుల వసూలులో తాండూరు మున్సిపాలిటీ వెనుకబడి పోయింది. ప్రతి ఏటా ఆస్తి పన్ను రూపంలో మున్సిపాలిటీకి రూ.13.50కోట్ల ఆదాయం సమకూరుతుంది. మరో 18 రోజుల్లో 2023 – 24 ఆర్థిక సంవత్సరం ముగియనుంది. అయితే ఇప్పటి వరకు కేవలం 22.20 శాతం మాత్రమే పన్నులు వసూలు చేశారు. ఇంకా 77.80 శాతం వసూలు చేయాల్సి ఉంది. ఈ ఏడాది 100 శాతం లక్ష్యం చేరుకోవడం అసాధ్యమనే చెప్పవచ్చు. పన్నుల వసూలులో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. తాండూరు మున్సిపాలిటీలో 36 వార్డులు.. 14,381 ఆవాసాలు ఉన్నాయి. ప్రతి ఏటా ఆస్తి పన్ను రూపంలో మున్సిపాలిటీకి రూ.13.50కోట్ల ఆదాయం సమకూరుతుంది. పన్నుల వసూలులో రెవెన్యూ అధికారులదే కీలక పాత్ర. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా ఆ శాఖ అధికారులు పెద్దగా పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి.

కొరవడిన సమన్వయం

మున్సిపాలిటీ నిర్వహణకు ప్రధాన ఆదాయ వనరు అయిన ఆస్తి పన్ను వసూలులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులకు మున్సిపల్ పాలక వర్గానికి సమన్వయం లేకపోవడంతో పాలన గాడి తప్పింది. మున్సిపల్ చైర్‌పర్సన్ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై పాలనాపరమైన చర్యలు తీసుకోవాలి. కానీ ఈ విధానం అమలు కావడం లేదు. దీంతో సిబ్బంది ఆడింది ఆట.. పాడింది పాటగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గడువులోపు చెల్లించాలి



మున్సిపల్ పరిధిలోని ఇళ్ల యజమానులు ఈ నెల 31లోగా ఆస్తి పన్ను చెల్లించాలి. ఆన్‌లైన్ లేదా వార్డుల్లో పర్యటించే మున్సిపల్, రెవెన్యూ అధికారులకు పన్నులు చెల్లించి సహకరించాలి. గడువులోగా పన్ను చెల్లించకుంటే 2శాతం అదనంగా వసూలు చేస్తాం.

– విక్రమ్‌సింహారెడ్డి, కమిషనర్, తాండూరు మున్సిపల్

క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం చిత్రపటం వద్ద ఆర్యవైశ్యులు

తాండూరు టౌన్: ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి స్థానిక ఆర్యవైశ్యులు బుధవారం పాలాభిషేకం చేశారు. పదేళ్ల పోరాటం అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం వైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కార్పొరేషన్‌కు రూ.5 వేల కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, యాలాల ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా, అధ్యక్షుడు వీరేందర్, నాయకులు మురళీ, సంతోష్ కుమార్, విజయలక్ష్మి, అనిల్, దామోదర్, మురళి, రమేష్, మంకాల స్వప్న, ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


చిన్ననర్సింహులు (ఫైల్)

పరిగి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కుర్వ చిన్ననర్సింహులు(50) వృత్తి రీత్యా గొంగళ్ల వ్యాపారస్తుడు. అయితే గొంగళ్ల వ్యాపారం గ్రామాలు, పట్టణాలలో సాఫీగా సాగుతున్నప్పటికీ వ్యక్తిగత కారణాలతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. అదే క్రమంలో ఆయన మద్యానికి బానిసై మంగళవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. గమనించిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతకగా సుల్తాన్‌పూర్ బ్రిడ్జిపై నుంచి తాడుతో ఉరి వేసుకున్నట్లు గుర్తించారు. పోలీసులు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని బ్రిడ్జిపై నుంచి తీసి పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య సత్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో వృద్ధుడి మృతి

ఇబ్రహీంపట్నం: అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నం ఆర్టీసీ బస్టాండ్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లికి చెందిన గొకినేని శ్రీనివాస్‌రెడ్డి(62) రెండు నెలలుగా ఇబ్రహీంపట్నం బస్టాండ్‌లో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. బస్టాండ్ దుకాణదారులు, ప్రయాణికులు చెప్పే వివిధ కూలీ పనులు చేస్తూ అక్కడే నైట్ వాచ్‌మెన్‌గా కాలం వెళ్లదీస్తున్నారు. మంగళవారం రాత్రి బస్టాండ్‌లోని కంట్రోల్ రూమ్ వద్ద శ్రీనివాస్‌రెడ్డి కింద పడుకొని ఉండటంతో నిద్రిస్తున్నాడని విధి నిర్వహణకు వచ్చిన నర్సింహులు భావించారు. కొద్ది సేపటికి శ్రీనివాస్‌రెడ్డిని లేపేందుకు యత్నించగా అప్పటికే మృతి చెందాడని నర్సింహులు పోలీసులకు తెలిపారు. వారం రోజులుగా మృతుడు అనారోగ్యంతో బాధ పడుతున్నట్లు ఆర్టీసీ సిబ్బంది తెలిపింది. ఈ మేరకు బుధవారం కేసు నమోదు చేసుకొని మృతుని వద్ద ఉన్న సెల్ ఫోన్ కాల్‌డేటా ఆధారంగా వాకబు చేశారు. కానీ ఎవరూ స్పందించలేదు. ఈ మేరకు పెద్ద కొత్తపల్లి గ్రామానికి సమాచారం ఇచ్చిన ఫలితం దక్కలేదు. దీంతో పోలీసులు మృతుని కుటుంబసభ్యుల గురించి ఆరా తీస్తున్నారు.

బీరువాలో దాచిన ఆభరణాలు మాయం

మొయినాబాద్: తాకట్టు నుంచి విడిపించుకొచ్చి ఇంట్లో బీరువాలో పెట్టిన 32 తులాల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. ఈ సంఘటన మొయినాబాద్‌లోని సహారా కాలనీలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ గ్రామానికి చెందిన మహ్మద్ చాంద్‌పాషా మార్వాడీ షాపులో తాకట్టు పెట్టిన 32 తులాల బంగారు ఆభరణాలను ఈ నెల 7న విడిపించుకొచ్చి బీరువాలో పెట్టారు. మంగళవారం మధ్యాహ్నం బీరువా తెరిచి చూడగా ఆభరణాలు కనిపించలేదు. దీంతో ఇల్లంతా వెతికారు. ఇంట్లో పనిచేసే మహిళపై అనుమానంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఈ మేరకు కేసు నమోదు చేశారు.

కాక్రవేణి.. వెతల కహానీ!


రుక్మాపూర్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారి


వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న నది (ఫైల్)

- వేసవి మినహా మిగతా కాలాల్లో తప్పని తిప్పలు
- నదిపై బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తుల డిమాండ్

యాలాల: నదిపై వంతెన నిర్మాణం లేక గ్రామస్తులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. మండల పరిధిలోని అడాల్‌పూర్ పరిధిలో ఉన్న కాక్రవేణి నది కారణంగా చుట్టు పక్కల గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. కాక్రవేణి నదికి సమీపంలో గ్రామస్తులు నిత్యం రైల్వేస్టేషన్‌కు వెళుతుంటారు. ఇలా వేళ్లే వారు కచ్చితంగా నదిని దాటి తీరాలి. వీరిలో కూలీలు, విద్యార్థులు, రైతులు, వ్యాపారులు అధికంగా ఉన్నారు. వేసవి మినహా మిగతా సీజన్‌లో నదిలో నీళ్లు ఎక్కువగా ఉండటంతో దాటేందుకు వీలు లేక దాదాపు 25 కిలోమీటర్లు చుట్టూ తిరిగి తాండూరు పట్టణానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

నది దాటేందుకు అవస్థలు

యాలాల, పెద్దేముల్ మండల పరిధిలో కాక్రవేణి నది ఉంది. నది అవతలి వైపు రుక్మాపూర్ రైల్వేస్టేషన్ అందుబాటులో ఉంది. కాగా యాలాల మండల పరిధిలోని అడాల్‌పూర్, బాణాపూర్, అన్నాసాగర్, కమాల్‌పూర్, బిజ్జారం, బొంకూరు తదితర గ్రామాల ప్రజలు నదికి అటువైపు ఉన్న రైల్వేస్టేషన్‌కు వెళ్లి దూర ప్రాంతాలకు వెళుతుంటారు. వేసవి మినహా మిగతా కాలాల్లో నదిలో నడుము లోతు నీళ్లు ఉంటుండటంతో విద్యార్థులు, వృద్ధులు, మహిళలు నది దాటేందుకు అవస్థలు పడుతుంటారు. రైల్వే మార్గాన ఈ ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, వ్యాపారులు, విద్యార్థులు, కూలీలు నగరంతో పాటు తాండూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. నదిలో ఉండే నీళ్లతో వీరి రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి కాక్రవేణి నదిపై బ్రిడ్జి నిర్మాణం చేపడితే సమస్య శాశ్వతంగా పరిష్కారానికి వీలుంది. బ్రిడ్జి నిర్మాణం చేపడితే ఇటు గ్రామస్తులతో పాటు విద్యార్థులకు, రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

నాచు పట్టి.. శిథిలావస్థకు చేరి!

ప్రమాదకరంగా వాటర్ ట్యాంకు



బంట్వారం: మండల కేంద్రం కోట్‌పల్లిలో 40 ఏళ్ల కిందట నిర్మించిన వాటర్ ట్యాంక్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు బయటికి తేలాయి. చాలా కాలంగా లీకేజీ కావడంతో నీరు కారుతూ నాచు పట్టింది. ఈ ట్యాంకు నుంచే ఇప్పటికీ నీటి సరఫరా జరుగుతుంది. మెయిన్ రోడ్డుకు పక్కనే ఈ ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌ను చాలా కాలం కిందట నిర్మించారు. ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. ఈ ట్యాంక్ కింది నుంచే గ్రామస్తులు తిరుగుతుంటారు. చిన్న పిల్లలు అక్కడే ఆటలు ఆడుతూ కనిపిస్తారు. సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సత్వరమే ట్యాంక్‌ను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాల్సిన గ్రామస్తులు కోరుతున్నారు.

జాతరకు తీసుకుపోలేదని ఆత్మహత్య


రేణుక మృతదేహం

చేవెళ్ల: జాతరకు తీసుకుపోలేదనే విషయంలో భార్యాభర్తలు గొడవ పడ్డారు. మనస్తాపంతో భార్య ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన భీమ్‌కుమార్, రేణుక(27) దంపతులు. బతుకు దెరువు నిమిత్తం మూడు నెలల క్రితం చేవెళ్లకు వచ్చి అద్దె గదిలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నారు. వీరికి ఒక బాబు ఉన్నాడు. మండల కేంద్రంలో ప్రస్తుతం శివరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ జాతరకు తీసుకుపోవాలనే విషయంలో భార్యాభర్తలు రాత్రి గొడవ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన రేణుక ఇంట్లో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతురాలి తండ్రి మల్లప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి

పరిగి: పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి కోరారు. బుధవారం పట్టణ కేంద్రంలోని వేంకటేశ్వరసామి ఆలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 19, 20, 21వ తేదీల్లో మూడు రోజులు బ్రహ్మోత్సవాలను దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. ఆలయం దేవాదాయశాఖ ఆధీనంలోకి వెళ్లాక జాతర చేయడం ఇదే మొదటిసారి అన్నారు. నియోజకవర్గంలోని భక్తులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో సిద్ధాంతి పార్థసారథి, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణా, కద్మూర్ ఆనందం, చిన్న నర్సింహులు, ఆంజనేయులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు.. కూలేట్టు!

- దెబ్బతిని రెండేళ్లైనా మరమ్మతులు శూన్యం
- కొత్తగా నిర్మించాలంటున్న స్థానికులు


బాస్‌పల్లి, గొడుగోనిపల్లి కల్వర్టు దుస్థితి

దోమ: భారీ వర్షాలకు ధ్వంసమై శిథిలావస్థకు చేరుకున్న కల్వర్టుతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు కూలి, ఏం ప్రమాదం తెచ్చిపెడుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం కురిసిన వానలకు బాస్‌పల్లి, గొడుగోనిపల్లి గ్రామ సమీపంలోని పరిగి, మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిలోని కల్వర్టు దెబ్బతిని కూలడానికి సిద్ధంగా ఉండటం కలవరపెడుతోంది.

వరద వస్తే అంతే..

దెబ్బతిన్న కల్వర్టును పలుమార్లు జెడ్పీటీసీ నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశం పరిశీలించారు. మండల సర్వసభ్య సమావేశంలో చర్చించారు. వెంటనే కల్వర్టును కూల్చేసి, కొత్తగా నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అయినా.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్న చందంగా.. కొత్తగా నిర్మాణం సంగతి ఎలా ఉన్నా.. కనీసం మరమ్మతులు చేయించిన పాపాన పోలేదని స్థానిక ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. పరిగి నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారి కావడంతో.. వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయని, రాత్రి వేళల్లో పలువురు వాహనదారులు ప్రమాదం బారిన పడి, గాయాలపాలైనట్లు వెల్లడించారు. ఇప్పటికైనా వానాకాలం సమీపించేలోపు కల్వర్టు నిర్మాణం చేపట్టాలని, లేని యెడలా వరద ధాటికి అది కూలిపోయే ప్రమాదం ఉందని చెప్పారు.

పట్టించుకోని అధికారులు



కల్వర్టు దెబ్బతిని రెండేళ్లు కావస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇదే విషయమై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశాం. అయినా ఫలితం శూన్యం. కల్వర్టు సమీపంలో రోడ్డు మొత్తం గుంతలుగా మారింది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వెంటనే కల్వర్టు నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.
– జహీర్, ప్రయాణికుడు, గొడుగోనిపల్లి

గోమాతకు సీమంతం


గోమాతకు సీమంతం నిర్వహిస్తున్న మహిళలు

షాబాద్: ప్రకృతిలోని జీవులతో మనిషికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తూ భారతీయ సాంప్రదాయంలో ప్రత్యేక స్థానం ఉందని జోషి గాయత్రి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని సీతారాంపూర్‌లో గోమాతకు కుటీరంలో మహిళలు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోవుకు మా కుటుంబం ఘనంగా సీమంత వేడుకలు నిర్వహించామన్నారు. స్త్రీ మరో జీవికి ప్రాణం పోసే ముందు క్షేమాన్ని కాంక్షిస్తూ హిందూ సంస్కృతిలో జరిపే ముఖ్య ఘట్టం సీమంతమన్నారు. తల్లి, పుట్టబోయే శిశువు క్షేమాన్ని కోరుతూ జరిపించే సాంప్రదాయ వేడుక సాధారంగా గర్భవతికి 5వ నెల గాని, తొమ్మిది నెలలో గాని సీమంతం జరుపుతారన్నారు. కొంతకాలంగా పెంపుడు జంతువులు గర్భం దాలిస్తే సీమంతం జరిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో గోమాతకు కూడా వేడుక చేశామన్నారు. కార్యక్రమంలో జోషి, సాయి, ప్రజ్ఞా, విశాల్ శర్మ, గోభక్తులు గ్రామస్తులు తదితరులు న్నారు.

షాపుల్లో వరుసగా చోరీ

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో మూడు దుకాణాల్లో బుధవారం తెల్లవారుజామున దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని ఓ కిరాణ దుకాణంలో దొంగలు తలుపులు ధ్వంసం చేసి గల్లాలో ఉన్న డబ్బును దొంగలించారు. అక్కడి నుంచి రెండు ల్యాబ్‌ల్లో సైతం తాళాలు విరగొట్టి కొంత నగదును లూటీ చేశారు. కాగా మొత్తం మూడు దుకాణాల్లో కలిపి రూ.8 వేల వరకు నగదును ఎత్తుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ నాగరాజు తెలిపారు.

చేవెళ్లలో బీజేపీ జెండా ఎగరాలి

ఆ పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


షాబాద్: మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కొండావిశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: చేవెళ్ల పార్లమెంటు స్థానంలో బీజేపీ గెలిపించేందుకు అందరూ కృషి చేయాలని ఆ పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చాకలిగూడగ్రామంలో బీజేపీ జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు మోదీ ప్రభుత్వం హయాంలోనే జరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని విస్మరించాయన్నారు. మరోసారి బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. అధిక పార్లమెంటు స్థానాలను గెలుచుకుంటేనే మోదీ మళ్లీ అధికారంలోకి వస్తారన్నారు. చేవెళ్ల ఎంపీ సీటును గెలిపించుకొని ప్రధానికి బహుమతిగా ఇద్దామని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాశ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు మధుసుధన్‌రెడ్డి, రాజమల్లేశ్, చంద్రశేఖర్, మల్లేశ్‌గౌడ్, వెంకటేష్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శుద్ధమైన నీరు ఆరోగ్యానికి మేలు

షాబాద్: శుద్ధమైన నీటిని తాగితే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మన్‌మర్రి గ్రామంలో వరల్డ్ కినెక్ట్ కార్పొరేషన్, సీపీడబ్ల్యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ వాటర్ ప్యూరిఫికేషన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కాచి, చల్లార్చిన నీటిని తాగడంతో ఆరోగ్యానికి మంచిదన్నారు. రోజుకు కనీసం మూడు నాలుగు లీటర్ల నీరు తాగడం అవసరమన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీటిని సరఫరా చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు సుహాసిని సత్యనారాయణ, గోపాల్, శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణ, గోపాల్, మల్లారెడ్డి, వెంకటేశ్, చంద్రశేఖర్, వెంకటేశ్‌గౌడ్, సురేశ్‌గౌడ్, శంకరయ్య, ముసిలయ్య, నర్సింహులుగౌడ్ తదితరులున్నారు.

రైతుల ప్రోత్సాహానికే బండలాగుడు పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట: రైతులను ప్రోత్సహించేందుకే బండలాగుడు పోటీలను నిర్వహిస్తారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని కాకునూర్ గ్రామ శివారులోని శ్రీ మహాలింగేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. అందులో భాగంగా బుధవారం అంతర్రాష్ట్ర రెండేడ్ల బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎద్దులతో రైతులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఈ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలని అన్నారు. దైవచింతనతోనే మానసిక ప్రశాంతత వస్తుందన్నారు. అనంతరం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సూరం జంగయ్య కొంతకాలంలో అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతడి చికిత్స నిమిత్తం రెండు లక్షల ఎల్‌ఓసీని బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల శ్రావణ్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీటీసీలు సురేష్‌రెడ్డి, రమాదేవి, నాయకులు వీరేష్, నర్సింగ్‌రావు, శ్రీధర్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, భాస్కర్‌గౌడ్, పర్వతాలు, యాదయ్య యాదవ్, సుందరయ్య, భీమయ్య, రవీందర్‌గౌడ్, మనోహర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తాగిన మైకంలో వ్యక్తి హల్‌చల్

విద్యుత్ స్తంభం ఎక్కిన వైనం


విద్యుత్ స్తంభం ఎక్కిన వ్యక్తి

అనంతగిరి: గుర్తు తెలియని వ్యక్తి తాగిన మైకంలో బుధవారం రాత్రి విద్యుత్ స్తంభం ఎక్కి హల్‌చల్ చేశాడు. ఈ ఘటన వికారాబాద్ పట్టణంలోని ప్రధాన రోడ్డులో తారాచంద్ స్వీట్ హౌజ్ ముందు చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి ఓ వ్యక్తి విద్యుత్ స్తంభం ఎక్కాడు. ఇది గమనించిన స్థానికులు కిందకు దిగాలని ఎంత చెప్పినా అతడు దిగలేదు. దీంతో పోలీసులకు సమాచారమివ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులు చాకచక్యంగా విద్యుత్ స్తంభం ఎక్కి అతన్ని దించి పోలీసులకు అప్పగించారు.

టాలెంట్ టెస్టులతో విద్యార్థులకు ప్రోత్సాహం



విద్యార్థులను సత్కరిస్తున్న వెంకటేశ్వరావు

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరావు

మాడ్గుల: టాలెంట్ టెస్టులతో విద్యార్థులకు ప్రోత్సాహం అందుతుందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరావు అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలను ఏటా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని ఇర్విన్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన సైన్స్ టాలెంట్ రాష్ట్రస్థాయి పోటీలలో రెండవ బహుమతి సాధించిన విద్యార్థులు చరణ్ తేజ, శ్రోహిత్, జునైద్‌లకు బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఘనంగా సత్కరించి అభినందించారు. అలాగే గైడ్ ఉపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి, నాగమణి, భిక్షపతి, శ్రీలక్ష్మిలను సత్కరించారు. అనంతరం వెంకటేశ్వరావు మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. విద్యార్థులు సైన్స్ ప్రాధాన్యతను గుర్తించాలని మూఢ నమ్మకాల నిర్మూలనకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి బి.ఎస్.రెడ్డి, మాడ్గుల ఎంఈఓ సర్దార్ నాయక్, ప్రధానోపాధ్యాయుడు పర్వతాలు, ఉపాధ్యాయులు సుధారాణి, ముత్యం రెడ్డి, రమాణచార్యులు, నాగమణి, వెంకటయ్య, నందన, భిక్షపతి, అర్చన, శ్రీలక్ష్మి, మొగులయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

2.3 కిలోల గంజాయి స్వాధీనం


పోలీసుల అదుపులో నిందితులు

కందుకూరు: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 2.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మక్బూల్‌జానీ తెలిపిన వివరాల ప్రకారం.. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ మీరాజ్ అన్సారీ(27), మహ్మద్ షాబుద్దీన్ అన్సారీ(26) కొంత కాలంగా కందుకూరుకు వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. కాగా డబ్బులు అధికంగా సంపాదించాలనే ఆశతో ఝార్ఖండ్ నుంచి రెండు కిలోల 300 గ్రాముల గంజాయిని ఈ నెల 10న తెచ్చారు. మంగళవారం సాయంత్రం కందుకూరు చౌరస్తా సమీపంలోని శ్రీశైలం హైవే హైటెక్ దాబా ఎదుట విక్రయిస్తుండగా పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి నుంచి గంజాయి బుధవారం వారిద్దరిని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో నీటి వృథా లేదు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో తాగు నీటి వృథాపెద్దగా లేదని జలమండలి తెల్పింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం నగరంలో దినసరి 568 ఎంజీడీ నీటి సరఫరా చేస్తున్నట్లు వెల్లడించింది. కృష్ణా మూడు దశల ద్వారా 270 ఎంజీడీ, గోదావరి ద్వారా 172 ఎంజీడీ, మంజీరా–సింగూర్ నుంచి 106 ఎంజీడీ, ఉస్మాన్ సాగర్ నుంచి 16 ఎంజీడీ, హిమయత్‌సాగర్ నుంచి 2 ఎంజీడీ నీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొంది. ట్రాన్స్ మిషన్‌లో నష్టాలు 1శాతం కంటే తక్కువగా ఉంటాయని పేర్కొంది.